సాక్షి వికారాబాద్

సోమవారం । 23 । డిసెంబర్ । 2024



పనుల్లో జాప్యం

దుద్యాల్–హస్నాబాద్ మార్గంలో కల్వర్టు పనులు పూర్తికాక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 8లో ▸



అంజన్న ఉత్సవం..

అంజన్నా.. కరుణించన్నా.. అంటూ భక్తులు అడవిలో వెలిసిన ఆంజనేయస్వామికి మొక్కులు తీర్చుకున్నారు. 8లో ▸



రక్తదానంతో ప్రాణదానం

రక్త దానం ప్రాణదానంతో ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి అన్నారు. రక్తదానం చేసిన వారిని ఆయన అభినందించారు. 9లో ▸

న్యూస్‌రీల్

పేదల ప్రతినిధి కాకా

అదనపు కలెక్టర్ సుధీర్



కాకా చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది

అనంతగిరి: కేంద్ర మాజీ మంత్రి గడ్డం వెంకటస్వామి వర్ధంతిని ఆదివారం కలెక్టరేట్ కార్యాలయంలో అధికారికంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) సుధీర్, సాంఘిక సంక్షేమ అధికారి మల్లేశం, డీవైఎస్‌ఓ హనుమంతురావు తదితరులు కాకా చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ సుధీర్ మాట్లాడుతూ.. సుదీర్ఘకాలం కేంద్ర మంత్రిగా, పార్లమెంట్ సభ్యుడిగా పేదల ప్రతినిధిగా పేరు గడించారన్నారు. దళిత, బహుజనుల అభ్యున్నతికి కృషి చేసిన మహనీయుడు అన్నారు. ఆయన సేవలను గుర్తిస్తూ నిరంతరం స్మరించుకునేలా ప్రభుత్వం అధికారికంగా జయంతి, వర్ధంతి వేడుకలను నిర్వహిస్తోందని అన్నారు. వెంకటస్వామి అడుగుజాడల్లో నడుస్తూ, ఆయన ఆశయాల సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారి శుక్రవర్ధన్ రెడ్డి, హాస్టల్ వార్డెన్లు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బీటీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయండి

షాద్‌నగర్ ఎమ్మెల్యేకు ముజాహిద్‌పూర్ నేతల వినతి



వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నేతలు

కుల్కచర్ల: బీటీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ముజాహిద్‌పూర్ కాంగ్రెస్ నాయకులు షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను కోరారు. ఆదివారం షాద్‌నగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి వెళ్లిన వారు చౌదర్‌గూడెం మండలం పెద్ద ఎల్కిచర్ల నుంచి మండల పరిధిలోని ముజాహిద్‌పూర్ వరకు బీటీ రోడ్డు లేక ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారని చెప్పారు. ఇప్పటికైనా స్పందించి రోడ్డు లేని గ్రామాలకు బీటీ రోడ్ల నిర్మాణం కోసం నిధులు మంజూరుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో షాద్‌నగర్ బ్లాక్ అధ్యక్షుడు జగదీశ్వర్, కాంగ్రెస్ చౌదర్‌గూడెం మండల అధ్యక్షుడు రాజు, మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణారెడ్డి, వికారాబాద్ డీసీసీ కార్యదర్శి దేశ్‌ముఖ్ చంద్రభూపాల్, సీనియర్ నాయకులు శివకుమార్, రాములు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

జీటీఏ జిల్లా కార్యవర్గ నియామకం

అధ్యక్ష, ప్రధానకార్యదర్శులుగా బందెప్ప, వెంకట్రాములు



బందెప్ప



వెంకట్రాములు

తాండూరు టౌన్: గవర్నమెంట్ టీచర్స్ అసోసియేషన్ (జీటీఏ) జిల్లా నూతన కార్యవర్గాన్ని ఆదివారం రాష్ట్ర శాఖ బాధ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా తాండూరుకు చెందిన ఎస్.బందెప్ప, ప్రధాన కార్యదర్శిగా వెంకట్రాములు, కోశాధికారిగా ఎం.సుధీర్‌ను నియమించారు. ఈసందర్భంగా నూతనంగా నియమితులైన అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామన్నారు. తమపై నమ్మకంతో జిల్లా బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర శాఖ బాధ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆదర్శ పాఠశాలలో ప్రవేశాలకు ఆహ్వానం

శంకర్‌పల్లి: తెలంగాణ ఆదర్శ పాఠశాలలో 2025–2026 సంవత్సరానికి గాను 6 నుంచి 10వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు శంకర్‌పల్లి ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ శోభారాణి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జనవరి 6వ తేదీ నుంచి http://telanganams.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, ఫిబ్రవరి 28 దరఖాస్తుకు చివరి తేదీ అని తెలిపారు. ఓసీలకు రూ.200, బీసీ, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ, ఈడబ్ల్యూఎస్ విద్యార్థులు రూ.125 దరఖాస్తు ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఏప్రిల్ 13న రాత పరీక్ష ఉంటుందన్నారు.



కోట్‌పల్లి ప్రాజెక్టులో పర్యాటకుల బోటింగ్

ఉల్లాసంగా.. ఉత్సాహంగా

బోటింగ్ సరదా తీర్చుకునేందుకు పర్యాటకులకు ముందుగా గుర్తొచ్చేది కోట్‌పల్లి రిజర్వాయరే. ఇక్కడ ఫారెస్ట్ అధికారులు ఏర్పాటు చేసిన కయాకింగ్, పైడిల్ బోటింగ్ చేస్తూ టూరిస్టులు సంబురపడుతారు. పదేళ్లలోపు పిల్లలకు కయాకింగ్‌కు అనుమతి లేకపోవడంతో వీకెండ్‌కు పిల్లలతో వచ్చిన తల్లిదండ్రులు సైతం పైడిల్ బోటింగ్ చేస్తూ సరదాగా గడిపారు. ప్రాజెక్టు అలుగుపై వరద ప్రవాహం లేకపోవడంతో ప్రాజెక్టు చూస్తూ సెల్ఫీలు, ఫొటోలు దిగుతూ సందడిగా గడిపారు. యువత జేకే ఎంఆర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కయాకింగ్ బోటింగ్ చేశారు.

– ధారూరు



ఫొటోలకు ఫోజులిస్తున్న పర్యాటకులు

ఆయిల్‌పామ్‌పై రైతుల ఆసక్తి

90 శాతం రాయితీపై మొక్కలు, డ్రిప్ పరికరాలు

ఆయిల్‌పామ్ సాగుతో లాభాలుండడంతో ప్రభుత్వం ఆదిశగా రైతులను ప్రోత్సహిస్తోంది. **ఐదేళ్ల** వరకు అంతరపంటల సాగు**కు** అనుకూలంగా ఉండడంతో **అధిక** రాబడి వచ్చే పంటపై రైతులు **సైతం** ఆసక్తి కనబరుస్తున్నారు.

- జిల్లాలో 2 వేల ఎకరాల్లో సాగుకు ప్రభుత్వ లక్ష్యం
- ఇప్పటికే వేయి ఎకరాల్లో సాగు ప్రారంభం
- 1,750 మంది రైతుల దరఖాస్తులు
- టార్గెట్‌కు చేరువలో ఉద్యానవన శాఖ



వికారాబాద్: ఆయిల్ పామ్ ఉత్పత్తులకు మార్కెట్‌లో డిమాండ్ ఉండటంతో ప్రభుత్వం రైతులను ఆ దిశగా ప్రోత్సహిస్తోంది. పంట సాగు చేసే రైతులకు పెద్ద మొత్తంలో రాయితీలు అందిస్తోంది. భవిష్యత్ అవసరాలు, డిమాండ్ దృష్టిలో ఉంచుకుని ఉద్యాన శాఖ అధికారులకు టార్గెట్ సైతం విధించింది. ప్రస్తుతం ఆయిల్ పామ్ ఆవశ్యకతను గుర్తించిన ప్రభుత్వం సాగుపై విస్తృత అవగాహన కల్పించాలని నిర్ణయించింది. ఉద్యానవన శాఖతో పాటు వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు ఈ పంట సాగు, ప్రభుత్వం ఇస్తున్న రాయితీలను వివరిస్తున్నారు. దీంతో ఇటీవల ఆయిల్ పామ్ సాగుకు ఆసక్తి కనబరుస్తున్నారు. ప్రభుత్వం జిల్లాకు ఇచ్చిన టార్గెట్‌కు సైతం ఉద్యానవన శాఖ చేరువయింది.

35వేల ఎకరాలు సాగుకు అనుకూలం

జిల్లా వ్యాప్తంగా 4.9లక్షల ఎకరాలు సాగవుతుండగా ఇందులో 50వేల ఎకరాల్లో ఉద్యానవన పంటలు రైతులు సాగు చేస్తున్నారు. ఇటీవల ఆయిల్‌పామ్ ఆవశ్యకతను గుర్తించిన ప్రభుత్వం జిల్లాల వారీగా లక్ష్యాలను విధించింది. జిల్లాలో 35వేల ఎకరాల భూములు ఈ పంట సాగుకు అనుకూలంగా ఉన్నాయని ఉద్యానవనశాఖ శాస్త్రవేత్తలు గుర్తించారు. ఈ ఏడాది జిల్లాలో కనీసం 2వేల ఎకరాల్లో సాగు చేపట్టేలా రైతులను ప్రోత్సహించాలని ప్రభుత్వం టార్గెట్ విధించింది. ఉద్యానవన శాఖలో సిబ్బంది కొరత ఉన్నప్పటికీ వ్యవసాయ శాఖ అధికారుల సమన్వయంతో పనిచేస్తూ లక్ష్యానికి చేరువయ్యారు. ఇప్పటికే 1,750 మంది రైతులు సుముఖంగా ఉన్నామని దరఖాస్తులు చేసుకున్నారు. ఇప్పటికే వేయి ఎకరాల్లో పంట సాగు ప్రారంభమైంది.

ఎకరాకు రూ.2,100 ప్రభుత్వ ప్రోత్సాహకం

సాగుకు ముందుకు వచ్చే రైతులకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు, రాయితీలు అందిస్తోంది. ఐదెకరాల వరకు సాగు చేసే సన్న, చిన్నకారు రైతులకు 90శాతం రాయితీపై మొక్కలు, డ్రిప్ పైపులు అందిస్తోంది. పంట దిగుబడి ప్రారంభమయ్యే వరకు అంతరపంటలు సాగు చేసుకునేందుకు ఏడాదికి ఎకరాకు రూ.2,100 చొప్పున అందజేయనుంది. తొమ్మిది నుంచి 12 ఎకరాల విస్తీర్ణంలో పంట సాగు చేసే రైతులకు మొక్కలు, డ్రిప్‌పై 80శాతం రాయితీ అందించనున్నారు.

ఏటా రూ.2.5లక్షల ఆదాయం

ఆయిల్‌పామ్ దీర్ఘకాలిక పంట. సాగు ప్రారంభమైన మూడున్నరేళ్ల తర్వాత పంట ప్రారంభమై ఐదేళ్లకు విక్రయానికి వస్తుంది. ఐదవ సంవత్సరం నుంచి 30 ఏళ్ల వరకు ఏడాది 10 నుంచి 16 టన్నుల దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ లెక్కన రైతుకు ఐదో ఏట నుంచి ఏడాదికి రూ.2.5లక్షల ఆదాయం సమకూరనుంది. ఎకరాకు 57 మొక్కలు మాత్రమే నాటుకునే వీలుంటుంది. అంతర పంటలుగా శ్రీగంధం, సర్వి, ఉల్లి, మిరియాలు, పసుపు, కూరగాయ సాగు చేసుకునే వీలుంటుంది. దీంతో రైతుకు అదనపు ఆదాయం సమకూరుతుందని అధికారులు వెల్లడిస్తున్నారు.

నీటి సౌకర్యం ఉండాలి



ఆసక్తి ఉన్న రైతులు మమ్మల్ని సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలి. ఎకరాకు రూ.1,750 డీడీ చెల్లించాలి. దరఖాస్తు దారులకు బోరుబావి లేదా ఇతర నీటి సౌకర్యం ఉండాలి. తాండూరు సమీపంలోని కోకట్ నర్సరీలో మొక్కలు అందుబాటులో ఉన్నాయి. పంటసాగు ప్రారంభించిన తర్వాత రైతులను ఆయిల్‌పామ్ ఉత్పత్తులు కొనుగోలు చేసే కంపెనీలతో అనుసంధానం చేస్తాం. సదరు కంపెనీ వారు పంట కొనుగోలు చేసిన వారం రోజుల్లో రైతులకు డబ్బు చెల్లిస్తారు. కూరగాయలు, ఇతర ఉద్యానవన పంటలు సాగు చేసే రైతులు కచ్చితంగా పంటలు నమోదు చేయించుకోవాలి.

– సత్తార్, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి

ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్



మందులు పంపిణీ చేస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

అనంతగిరి: ప్రతీ ఒక్కరు ఉచిత వైద్యశిబిరాలను ఉపయోగించుకుంటూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని శాసనసభ స్పీకర్ ప్రసాద్‌కుమార్ అన్నారు. ఆదివారం వికారాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని గిరేట్‌పల్లిలో గ్యాక్(గడ్డం ఎల్లమ్మ ఎల్లయ్య అనసూయ కృష్ణ) చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హైదరాబాద్, వికారాబాద్ ప్రాంతానికి చెందిన వైద్య నిపుణులు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో స్పీకర్ ప్రసాద్‌కుమార్ మాట్లాడుతూ.. తమ కుటుంబ సభ్యుల పేరిట ఏర్పాటు చేసిన గ్యాక్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. గ్యాక్ అనగా జర్మనీ భాషలో ఆపదలో ఆదుకోవడమని అర్థమని వివరించారు. వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. నిత్యం వ్యాయామం, యోగా అలవర్చుకోవాలన్నారు. శిబిరంలో తమ సేవలను అందించిన వైద్యులకు, ఇతర బృందానికి, సహకరించిన ప్రతీ ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటరవణ, మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల రమేష్‌కుమార్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ కిషన్‌నాయక్, ఏఎంసీ మాజీ చైర్మన్ రాంచంద్రారెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ సత్యనారాయణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అనంత్‌రెడ్డి, సీనియర్ నాయకులు కొండల్ రెడ్డి, చిగుళ్లపల్లి రమేష్‌కుమార్, యండీ హఫీజ్, నరోత్తంరెడ్డి, ఎర్రవల్లి జాఫర్, ప్రభాకర్‌రెడ్డి, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

స్పీకర్‌కు వినతి

కాంట్రాక్టు ఏఎన్‌ఎంలను రెగ్యులరైజ్ చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహిపాల్ కోరారు. ఈ మేరకు ఆదివారం ఆయన స్పీకర్ ప్రసాద్‌కుమార్‌కు కాంట్రాక్ట్ ఏఎన్‌ఎంలతో కలిసి సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా నాయకులు లీలావతి, వెంకటమ్మ, భారతి, సుహాసిని, మంజుల, స్రవంతి, రజియా, పద్మ, సల్మా, సుజాత, స్వరూప తదితరులు ఉన్నారు.

పోరాటాల ఘనత సీపీఐదే

పార్టీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి జంగయ్య

షాద్‌నగర్: కమ్యూనిస్టు పార్టీ చరిత్ర గురించి నాయకులు, కార్యకర్తలు ప్రజలందరికీ వివరించాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పాల్మాకుల జంగయ్య అన్నారు. పార్టీ ఏర్పడి వంద వసంతాలు అవుతున్న సందర్భంగా చేవెళ్ల, ఎల్బీనగర్‌లో నిర్వహించే భారీ బహిరంగ సభలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పాల్మాకుల జంగయ్య మాట్లాడుతూ.. భూమి కోసం, భుక్తి కోసం సీపీఐ ఆధ్వర్యంలో ఎన్నో పోరాటాలు చేయడం జరిగిందని అన్నారు. నిరుపేదలకు అండగా ఉంటూ ప్రభుత్వాలపై ఒత్తిళ్లు తెచ్చి ఎన్నో సమస్యలు పరిష్కారమయ్యేలా కృషి చేసిందన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం, తెలంగాణ మలిదశ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిందన్నారు. పార్టీ వందేళ్ల ఉత్సవం సందర్భంగా చేవెళ్ల, ఎల్బీనగర్‌లో భారీ బహిరంగ సభలు నిర్వహిస్తోందని తెలిపారు. జిల్లా, మండల కేంద్రాల్లో సభలు, సమావేశాలు, ప్రదర్శనలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర సమితి సభ్యుడు పానుగంటి పర్వతాలు, జిల్లా సమితి సభ్యుడు చందుయాదవ్, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పవన్‌చౌహాన్ తదితరులు పాల్గొన్నారు.

దర్గాను దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే 'పట్నం'

షాబాద్: మండల కేంద్రంలోని పహిల్వాన్‌షావలి దర్గాను ఆదివారం కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వం మైనార్టీల అభివృద్ధికి ఎంతో కృషి చేసిందని గుర్తు చేశారు. కులమతాలకు అతీతంగా కలిసికట్టుగా ఉండాలని సూచించారు. దర్గా అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని చెప్పారు. ఆయన వెంట జెడ్పీటీసీ మాజీ సభ్యుడు జడల రాజేందర్‌గౌడ్, మతీన్, ఆయుబ్‌ఖాన్, ఆరీఫ్, మజీద్, ఇమ్రాన్, మునీర్, బాబషీర్, తౌసిప్ తదితరులు ఉన్నారు.

మహమ్మారిపై సమరం

- కుష్టు రహిత సమాజ నిర్మాణమే లక్ష్యం
- 3,332 మంది అనుమానితుల్లో ఎనిమిది మందికి నిర్ధారణ
- అవసరమైనవారికి చికిత్స, ఉచితంగా మందులు



సర్వే నిర్వహిస్తున్న ఆశ కార్యకర్త(ఫైల్)

కొడంగల్ రూరల్: కుష్టు వ్యాధిని తరమికొట్టేందుకు ప్రభుత్వం క్షేత్రస్థాయిలో ప్రత్యేక చర్యలు చేపట్టింది. వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రణాళిక బద్ధంగా ముందుకు సాగుతూ జిల్లా వ్యాప్తంగా 14 రోజులపాటు సర్వే నిర్వహించారు. వ్యాధిగ్రస్తులు భయాందోళనలకు గురికాకుండా మందులు వాడినట్లయితే నయమవుతుందని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే వ్యాధి మరొకరికి సోకడంతోపాటు అంగవైకల్యం కలిగే అవకాశం ఉంటుందని వైద్యాధికారులు చెబుతున్నారు.

వ్యాధి వ్యాప్తి

కుష్టువ్యాధి అనేది లెప్రో మైక్రో బ్యాక్టీరియా లెప్రమోటోసిస్ అనే బ్యాక్టీరియా ద్వారా వ్యాపిస్తుంది. వ్యాధి సోకిన వ్యక్తి శ్వాస ద్వారా బ్యాక్టీరియా ఇతరులకు చేరుతుంది. ఇది సోకిన ఏడు రోజుల వరకు బ్యాక్టీరియా బతికే ఉంటుంది. శరీరంపై తెల్లటి, రాగి రంగు మచ్చలు రావడం, ఆ ప్రదేశంలో స్పర్శ లేకపోవడం, చేతి గోళ్లలో, నరాల్లో తిమ్మిర్లు, శరీరంపై వెంట్రుకలు రాలిపోవడం వంటివి ఈ వ్యాధి లక్షణాలు. వైద్యుల సలహా మేరకు మందులు వాడితే వ్యాధి తగ్గే అవకాశం ఉంటుంది.

ముందుగా గుర్తిస్తే మంచిది

కుష్టు వ్యాధి అనేది అంత ప్రమాదకరమైనది కాదని.. నయం చేయవచ్చు. నిర్లక్ష్యం చేస్తే మాత్రం కబళించే ప్రమాదం ఉంటుంది. ఎలాంటి ఆందోళనకు గురికాకుండా సమీపంలోని ప్రభుత్వాస్పత్రిలో పరీక్షలు చేసుకుని వ్యాధి నిర్ధారణతో మందులు వాడితే తగ్గిపోతుందని వైద్యులు సూచిస్తున్నారు. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో చికిత్స అందించడంతోపాటు మందులను ఉచితంగా అందజేస్తున్నారు.

86 మందికి చికిత్స

ప్రతీ కుటుంబంలో వారి ఆరోగ్య పరిస్థితిని గుర్తిస్తూ వ్యాధి సంబంధిత లక్షణాలున్న వారి వివరాలు నమోదు చేశారు. 3,332 మందిని అనుమానితులుగా గుర్తించి వారి వివరాలను సేకరించారు. ఇందులో ఎనిమిది మందికి మాత్రమే కుష్టు వ్యాధి ఉన్నట్లు నిర్ధారణ జరిగిందని వైద్యులు చెబుతున్నారు. ఇప్పటికే జిల్లాలో 78 మందికి చికిత్స అందిస్తుండగా సర్వేలో గుర్తించిన ఎనిమిది మందితో కలిపి మొత్తం 86 మందికి చికిత్స అందిస్తున్నట్లు వైద్యాధికారులు చెబుతున్నారు.

వ్యాధి అంతమే లక్ష్యం



కుష్టును అంతం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. వ్యాధి సోకిన వ్యక్తులు వైద్యుల సూచనల మేరకు మందులు వాడితే తగ్గుతుంది. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే అంగవైకల్యంతోపాటు మరికొంత మందికి వ్యాధి సోకే అవకాశం ఉంటుంది.

– డాక్టర్ రవీంద్రయాదవ్, జిల్లా టీబీ, లెప్రసీ ప్రోగ్రాం అధికారి



కూచిపూడి నృత్య ప్రదర్శన

ధ్యానం.. సంబరం

రెండో రోజుకు చేరిన ధ్యాన మహాయాగం

- హాజరైన సినీ స్టంట్ మాస్టర్స్ రామ్‌లక్ష్మణ్
- వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన ధ్యానులు





మాట్లాడుతున్న స్టంట్ మాస్టర్స్ రామ్‌లక్ష్మణ్

కడ్తాల్: సాధనతో సాధించలేనిదంటూ ఏదీ లేదని ధ్యానగురువు పరిణిత పత్రి అన్నారు. మహేశ్వర మహాపిరమిడ్ ధ్యాన కేంద్రంలో కొనసాగుతున్న పత్రీజీ ధ్యాన మహాయాగాలు ఆదివారానికి రెండో రోజుకు చేరుకున్నాయి. ఉదయం 5 నుంచి 8 గంటల వరకు సంజయ్ కింగి ఆధ్వర్యంలో ప్రాతఃకాల సంగీత ధ్యానం నిర్వహించారు. అనంతరం ధ్యానులను ఉద్దేశించి పరిణిత పత్రి మాట్లాడారు. నిరంతరం నేర్చుకోవాలనే తపన ఉండాలని, దానికి సాధనే మార్గమన్నారు. ధ్యాన యజ్ఞం నిరంతరం కొనసాగాలని ఆకాంక్షించారు. ధ్యానాన్ని మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని, ప్రతి ఒక్కరికీ ధ్యానం నేర్పుతూ పత్రీజీ సంకల్పాన్ని నెరవేర్చాలని కోరారు. ప్రపంచాన్ని ధ్యానమయం చేయడమే లక్ష్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. సినీ స్టంట్ మాస్టర్స్ రామ్ లక్ష్మణ్ మాట్లాడుతూ.. జీవితంలో ఎన్ని కష్టాలు ఎదురైనా దానిలోని సూక్ష్మాన్ని గ్రహించి సత్యం తెలుసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ఆత్మజ్ఞానాన్ని తెలుసుకోవాలని, ఆత్మ జ్ఞానం తెలుసుకున్న వారే ధ్యానులన్నారు. అనంతరం సుభాష్‌పత్రీజీ, స్వర్ణమాల పత్రిజీల వీడియో సందేశం ధ్యానులకు అందించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పలువురు గురువులు ఆధ్యాత్మిక, ధ్యాన సందేశం వినిపించారు. పిరమిడ్ మాస్టర్‌లు తమ ధ్యాన అనుభవాలను వివరించారు. ఆదివారం కావడంతో వేడుకలకు తెలుగు రాష్ట్రాలతో పాటు, దేశంలోని పలు ప్రాంతాలకు చెందిన ధ్యానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమంలో పిరమిడ్ ట్రస్ట్ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

చక్రంపల్లిలో స్పీకర్ ప్రత్యేక పూజలు



స్వామి వారిని దర్శించుకుంటున్న స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

మోమిన్‌పేట: మండల పరిధిలోని చక్రంపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న జాతర మహోత్సవంలో భాగంగా మల్లికార్జున స్వామిని ఆదివారం స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ దర్శించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ భక్తి భావాన్ని పెంపొందించుకోవాలన్నారు. గ్రామాల్లో మందిరాలకు వెళ్లి పూజించాలని ఆయన కోరారు. జాతర మహోత్సవాలు చేయడంతో సోదరభావం పెరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మహేందర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శంకర్, నాయకులు బాల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

యథేచ్ఛగా చెట్ల నరికివేత



ఆలేడ్ బండా రామలింగేశ్వర స్వామి ఆలయం సమీపంలో కలప డంపు

దుద్యాల్: అక్రమార్కులు కలపపై కన్నేసి విచ్చల విడిగా చెట్లను నరుకుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. మండల పరిధిలోని ఆలేడ్, హస్నాబాద్, గౌరారం, లగచర్ల గ్రామాల్లో ఆదివారం అక్రమార్కులు విచ్చల విడిగా చెట్లను నరుకుతున్నారు. ఎక్కడిక్కడ ఇష్టానుసారంగా కలప డంపులు ఏర్పాటు చేస్తున్నా అటవీ శాఖ అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. అధికారుల అండదండలతో కలప వ్యాపారులు రెచ్చిపోతున్నారు. దుద్యాల్ మండలంలో నిత్యం కలపను తరలిస్తున్నారని ఆయా గ్రామాలకు చెందిన పలువురు వాపోయారు. మండలంలో పెద్ద ఎత్తున చెట్లను నరుకుతూ అక్రమ రవాణాకు పాల్పడుతున్నారు. పర్యవేక్షించాల్సినా అధికా రులు మాత్రం తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని ప్రకృతి ప్రేమికులు వాపోతున్నారు.

హిట్ అండ్ రన్ కేసులో నిందితుడి అరెస్టు

పంజగుట్ట: హిట్ అండ్ రన్ కేసులో నిందితుడిని పంజగుట్ట పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. విద్యానగర్‌కు చెందిన పున్నం లోకేష్ (21) బాచుపల్లిలోని ఓ ప్రైవేట్ ఇంజినీరింగ్ కాలేజీలో బీటెక్ చదువుతున్నాడు. శుక్రవారం ఉదయం అతను స్నేహితుడితో కలిసి బైక్‌పై కాలేజీకి వెళుతుండగా అమీర్‌పేట బిగ్ బజార్ వద్ద వెనక నుంచి వేగంగా వచ్చిన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీ కొనడంతో లోకేష్ అక్కడిక్కడే మృతి చెందాడు. సీసీ కెమెరాల ఆధారంగా ప్రమాదానికి కారణమైన బస్సును గుర్తించారు. గో టు ట్రావెల్స్‌కు చెందిన బస్సును ప్రమాద సమయంలో డ్రైవర్ ఓం ప్రకాష్ నడుపుతున్నట్లు గుర్తించారు. శనివారం రాత్రి అతడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు బస్సును సీజ్ చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోడిపందేల స్థావరంపై దాడి..

జీడిమెట్ల: కోడిపందేల స్థావరంపై దాడి చేసిన జీడిమెట్ల పోలీసులు 11 మందిని అరెస్ట్ చేశారు. ఇన్‌స్పెక్టర్ మల్లేష్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఆదివారం కుత్బుల్లాపూర్ మున్సిపల్ గ్రౌండ్ సమీపంలో కొందరు వ్యక్తులు కోడి పందేలు నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు 11 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.15,440 నగదు 9 సెల్‌ఫోన్‌లు, 16 కత్తులు, ఆరు పందెం కోళ్లను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

BUSINESS SERVICES

■ మీ బంగారం మణప్పురం, ముత్తూట్, ఏ ఇతర ఫైనాన్స్‌లో ఉన్న మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. ఫోన్: 9177555694. [H-783410]

WANTED

■ త్రివేణి హోంకేర్‌లో వృద్ధులను, పేషెంట్లను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి, ఫుడ్, జీ: 18K. Ph: 9640400073, 9160900024 [SCA24000888]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/ డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

పనుల్లో జాప్యం వాహనదారులకు శాపం



దుద్యాల్-హస్నాబాద్ మార్గంలో కల్వర్టు దుస్థితి

రోడ్డు విస్తరణతో సంబర పడిన ప్రజానీకం పనుల్లో ఏర్పడిన జాప్యంతో నీరసిస్తున్నారు. త్వరితగతిన పూర్తి చేయాలని విన్నవిస్తున్నారు. కల్వర్టు వద్ద సూచికలు సైతం ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారించాలని అధికార యంత్రాంగాన్ని కోరుతున్నారు.

- ప్రమాదకరంగా మారిన కల్వర్టు
- త్వరితగతిన పూర్తి చేయాలని ప్రయాణికుల డిమాండ్

దుద్యాల్: ప్రయాణం ప్రాణ సంకటంగా మారిందని వాహనదారులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. దుద్యాల్–హస్నాబాద్ మార్గంలో కల్వర్టులు పూర్తికాక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మహబూబ్‌నగర్ నుంచి తాండూర్ అంతర్రాష్ట్ర రోడ్డును జాతీయ రహదారిగా అప్‌గ్రేడ్ చేశారు. అందుకు సంబంధించి రోడ్డు పనులు ప్రారంభమై ఏడాది గడుస్తున్నా.. నేటికి పూర్తి కాలేదు. కొంత మేర అక్కడక్కడ పూర్తయినా సింహభాగం ఇంకా కొనసాగుతున్నాయి. మరికొన్ని ప్రాంతాల్లో పనులు పూర్తిగా నిలిచిపోయాయి. అందులో భాగంగానే దుద్యాల్ గేట్ నుంచి హస్నాబాద్ మార్గ మధ్యలో కల్వర్టు అసంపూర్తిగా నిర్మించి వదిలేశారు. దీంతో కల్వర్టుల దగ్గర రోడ్డు దారుణంగా మారింది. నిత్యం వేల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. కల్వర్టుల వద్ద కనీసం తాత్కాలికంగా ప్రమాద సూచికలు కూడా ఏర్పాటు చేయలేకపోవడం ఏంటని చోదకులు ప్రశ్నిస్తున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని బిక్కుబిక్కుమంటున్నారు. వేసిన రోడ్డు సైతం కొంత భాగం వాహనాల రాకపోకలకు కూలిపోయింది. దీంతో కల్వర్టుల దగ్గర ప్రమాద తీవ్రత మరింత పెరిగింది. అధికారులు, కాంట్రాక్టర్ స్పందించి సూచికలు ఏర్పాటు చేయాలని వాహదారులు కోరుతున్నారు. అలాగే వీలైనంత త్వరలో రోడ్డు నిర్మాణ పనులను పూర్తి చేయాలని వేడుకొంటున్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

అదుపు తప్పి ఇదే కల్వర్టు గుంతలో ఈ నెల 9న తెల్లవారుజామున ఓ ఆటో ప్రమాదానికి గురైంది. దౌల్తాబాద్ మండలం నందారం గ్రామానికి చెందిన పాల వ్యాపారి ఆటోలో దుద్యాల్ గేట్ సమీపంలో ఉన్న మస్కటి కేంద్రంలో పాలు పోసి తిరిగి ఇంటికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఎదురుగా వస్తున్న లారీ డ్రైవర్ కల్వర్టు గుంతను గమనించకపోవడంతో ఒక్కసారిగా రోడ్డు మధ్యలోకి వచ్చాడు. దీంతో ఆటోను పక్కకు తిప్పడంతో కల్వర్టు గుంతలోనే పడిపోయింది. ఈ ఘటనలో పలువురికి గాయాలయ్యాయి. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే వెంటనే కల్వర్టుల నిర్మాణం పూర్తి చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



ఇటీవల కల్వర్టు గుంతలో పడిన ఆటో (ఫైల్)

ఆత్మరక్షణకు తైక్వాండో దోహదం



తైక్వాండో పోటీలను తిలకిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి తదితరులు

తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు: బాలికలు ఆత్మరక్షణకు తైక్వాండో నేర్చుకోవాలని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి సూచించారు. ఆదివారం పట్టణంలోని కన్యా పాఠశాలలో జిల్లా తైక్వాండో అసోషియేషన్ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు. వికారాబాద్ జిల్లా నుంచి 180 మంది పోటీలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి తైక్వాండో పోటీలను తిలకించారు. ఈ పోటీలలో 24 మంది బంగారు పతకం, 8 మంది వెండి పతకాలు సాధించారు. ఎస్ఆర్‌వై తైక్వాండో అకాడమి తాండూరు మొదటి స్థానం, ఫిట్‌నెస్ తైక్వాండో అకాడమి రెండో స్థానంలో స్టార్ కిడ్స్ తైక్వాండో అకాడమి మూడో స్థానంలో నిలిచాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తాండూరు పట్టణంలో బాల బాలికలకు ఆత్మరక్షణ విద్య అయిన తైక్వాండో శిక్షణ కల్పించడం అభినందనీయమన్నారు. ముఖ్యంగా బాలికలకు ఆత్మరక్షణ విద్యపై శిక్షణ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ తాటికొండ స్వప్నపరిమళ్, నాయకులు థారాసింగ్, మురళీకృష్ణగౌడ్, జిల్లా తైక్వాండో అసోషియేషన్ అధ్యక్ష కార్యదర్శులు రఘువన్, గోపాలకృష్ణ, మాస్టర్‌లు దోమరవి, వీరప్ప పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పక్కదారి

కేసులు నమోదైనా మారని దళారులు

కొందుర్గు: ప్రభుత్వం పేదల కోసం ఉచితంగా పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యం పక్కదారి పడుతున్నాయి. బియ్యం లబ్ధిదారులకు పంపిణీ చేసిన మరుసటి రోజే వాటిని కొనడానికి దళారుల వాహనాలు గ్రామాలకు చేరుకుంటాయి. అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న వాహనాన్ని పట్టుకొని పలుమార్లు పోలీసులు సీజ్ చేసి కేసులు నమోదు చేస్తున్నారు. అయినప్పటికీ రేషన్ బియ్యం అక్రమ రవాణా ఆగడం లేదని వాపోతున్నారు. ఈ ఏడాది నవంబర్ 5న రేషన్ తరలిస్తున్న వాహనాన్ని పట్టుకొని సీజ్ చేశారు. 100 బస్తాల రేషన్ బియ్యాన్ని సివిల్ సప్లయ్ అధికారులకు అప్పగించారు. గ్రామాల్లో తక్కువ ధరకు బియ్యాన్ని కొనుగోలు చేసి అధిక ధరలకు విక్రయించి దళారులు లాభార్జనకు పాల్పడుతున్నారు. అక్రమంగా కొనుగోలు చేసిన బియ్యం మండలంలోని చిన్నఎల్కిచర్ల, పుల్లప్పగూడ గ్రామాల్లో నిల్వచేసి ఇతర ప్రాంతాలకు తరలిస్తుంటారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ గ్రామాల్లోనే పలుమార్లు బియ్యం పట్టుబడ్డాయని అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రేషన్ బియ్యం అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.



పోలీసులు సీజ్ చేసిన వాహనం (ఫైల్)

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి



షాబాద్: విద్యార్థినులకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

షాబాద్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని మహాత్మా జ్యోతిపూలే గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శివరంజని పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని సరూర్‌నగర్ స్టేడియంలో నిర్వహించిన జిల్లా స్థాయి సీఎం కప్–2024 కబడ్డీ పోటీల్లో మండలంలోని గురుకుల పాఠశాల విద్యార్థినులు విజేతలుగా నిలిచారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు కూడా ముఖ్యమేనన్నారు. క్రీడాకారుల్లో ప్రతిభను వెలికితీసేందుకే ప్రభుత్వం సీఎం కప్ క్రీడాపోటీలు నిర్వహించిందన్నారు. కార్యక్రమంలో ఫరూఖ్‌నగర్ మండల ఇన్‌చార్జి రాజశేఖర్ రెడ్డి, పీడీ బాలయ్య, పీఈటీ రేణుక, మండల చైర్మన్, ఎంపీడీఓ, ఎంఈఓ, పీడీలకు, పీఈటీలు తదితరులు ఉన్నారు.

సీఎం కప్ పోటీల్లో మెరిసిన యువకుడు

శంకర్‌పల్లి: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సీఎం కప్–2024 జిల్లా స్థాయి పోటీల్లో శంకర్‌పల్లి మండలం కొండకల్ గ్రామానికి చెందిన వరుణ్ గౌడ్(16) సత్తా చాటాడు. సరూర్ నగర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన షాట్‌పుట్, డిస్క్‌త్రో విభాగాల్లో ప్రథమంగా నిలిచి తెలంగాణ ఒలంపిక్ అసోసియేషన్ సెక్రటరీ మల్లారెడ్డి చేతుల మీదుగా బంగారు పతకం అందుకున్నాడు. కొండకల్ గ్రామానికి చెందిన లక్ష్మణ్ గౌడ్, కల్పన దంపతుల చిన్న కుమారుడు వరుణ్ గౌడ్. ఈ యువకుడు ప్రస్తుతం బాసరా ఐఐఐటీలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. కుమారుడు జిల్లా స్థాయిలో బంగారు పతకం సాధించడం పట్ల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. భవిష్యత్తులో ఇలాంటి పతకాలు మరెన్నో సాధించాలని ఆకాంక్షించారు.



శంకర్‌పల్లి: ప్రశంసాపత్రం అందుకుంటున్న వరుణ్ గౌడ్

భార్య పుట్టింటికి వెళ్లి రాలేదని..

ఉరేసుకొని భర్త ఆత్మహత్య

తాండూరు రూరల్: పుట్టింటికి వెళ్లిన భార్య తిరిగి రాక పోవడంతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన మండలంలోని చెంగోల్ గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. కరన్‌కోట్ ఎస్ఐ విఠల్‌రెడ్డి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన నర్సగాళ్ల రమేష్(33) కూలీ పనులు చేసుకుంటు జీవిస్తున్నాడు. ఆయనకు 12 ఏళ్ల క్రితం కర్ణాటక రాష్ట్రం మిర్యాణ్‌కు చెందిన అనితతో వివాహమైంది. వీరికి పదేళ్ల కుమారుడు ఉన్నారు. కొన్నేళ్లుగా దంపతుల మధ్య మనస్పర్థలు ఏర్పడ్డాయి. దీంతో నాలుగేళ్ల నుంచి అనిత పుట్టింటిలో ఉంటుంది. దీంతో రమేష్ మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో ఆయన ఆదివారం సాయంత్రం చెంగోల్ గ్రామంలోని తన ఇంటిలో దులానికి చీరతో ఉరేసుకున్నాడు. తల్లి అనంతమ్మ చూసి స్థానికులకు చెప్పడంతో ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు



వెంకటేశ్ (ఫైల్)

మంచాల: అప్పు తీర్చు తానని చెప్పి ఓ వ్యక్తి ఇంట్లో నుంచి వెళ్లిపోయిన సంఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. మండలంలోని తిప్పాయిగూడ గ్రామానికి చెందిన గొర్రెంకల వెంకటేశ్(55) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆయన కూతురు పెళ్లికి కొంత అప్పు చేయడంతో నగరంలో ఉన్న ప్లాటును అమ్మేస్తానని కుటుంబ సభ్యులకు చెప్పాడు. ఈ క్రమంలో వెంకటేశ్ ఈ ఏడాది జూన్‌లో ఇంటి నుంచి వెళ్లిపోయాడు. తిరిగి రాకపోవడంతో ఆయన ఆచూకీ కోసం కుటుంబసభ్యులు వెతికినా లభ్యం కాలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆదివారం కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 77022 20964 నంబరుకు సమాచారం ఇవ్వాలని కోరారు.

ఆస్పత్రికి వెళ్లిన వృద్ధుడు..

పహాడీషరీఫ్: మందుల కోసం ఆస్పత్రికి వెళ్లిన ఓ వృద్ధుడు కనిపించకుండా పోయిన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ గురువారెడ్డి ఆదివారం తెలిపిన వివరాల ప్రకారం.. జల్‌పల్లి శ్రీరాం కాలనీకి చెందిన ఆదిమూలం సదానందం(75) అనారోగ్యం కారణంగా ఈ నెల 19వ తేదీన ఉదయం మందులు తెచ్చుకునేందుకని ఉస్మానియా ఆస్పత్రికి వెళ్లాడు. సాయంత్రం అయినా తిరిగి రాకపోవడంతో ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు సాధ్యమైన అన్ని ప్రాంతాల్లో వెతికినా ప్రయోజనం లేకుండా పోయింది. ఈ విషయమై అతని కుమారుడు సాయి కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు పోలీస్‌స్టేషన్‌లో గాని 87126 62367 నంబర్‌లో సమాచారం అందించాలని తెలిపారు.

తల్లి మందలించిందని బాలుడు..

ఇబ్రహీంపట్నం రూరల్: తల్లి మందలించడంతో ఇంట్లో నుంచి ఓ బాలుడు పారిపోయిన సంఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఏఎస్ఐ సోమయ్య కథనం ప్రకారం.. నాదర్‌గుల్ గ్రీన్‌హోమ్స్ కాలనీకి చెందిన కొంగర చందు అనే బాలుడు బడికి వెళ్లకుండా ఇంట్లోనే ఉంటున్నాడు. పాఠశాలకు వెళ్లమని తల్లి మందలించడంతో మనస్తాపానికి గురైన బాలుడు ఈ నెల 16వ తేదీన ఇంటి నుంచి వెళ్లిపోయాడు. అతడి కోసం వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. బాలుడి ఆచూకీ తెలిస్తే 87125 78845కి తెలియజేయాలని కోరారు.

ఉత్సవాలకు సన్నద్ధం

- 27 నుంచి ముద్దాయిపేట ఎల్లమ్మ జాతర
- మూడు రోజుల పాటు కొనసాగనున్న వేడుకలు
- ఏర్పాట్లలో నిమగ్నమైన ఆలయ కమిటీ సభ్యులు



జాతరకు ముస్తాబైన ఎల్లమ్మ ఆలయం



కొలువైన అమ్మవారు

యాలాల: ప్రసిద్ధిగాంచిన మండల పరిధిలోని ముద్దాయిపేట జగన్మాత రేణుక ఎల్లమ్మ జాతరకు ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ నెల 27 నుంచి ప్రారంభమయ్యే జాతరకు ఆలయ కమిటీ, గ్రామ పెద్దలు, యువకుల సమక్షంలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే ఉత్సవాల్లో భాగంగా రంగుల రాట్నం, బ్రేక్ డాన్స్, డ్రాగన్ రైలు లాంటి వినోద వస్తువులు జాతర ప్రాంగణంలో ఏర్పాటు అవుతున్నాయి. ఈసారి ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

కార్యక్రమాలు ఇలా..

జగన్మాత ఎల్లమ్మ ఉత్సవాలు ఈనెల 27 నుంచి ప్రారంభం కానున్నాయి. ఉత్సవాల ప్రారంభం సందర్భంగా ఈ నెల 26న రాత్రి అమ్మవారి ఊరేగింపు చేపట్టనున్నారు. 27న(శుక్రవారం) సాయంత్రం సిడే ఊరేగింపు, 28న చుక్కబోనాలు, 29 రథోత్సవ కార్యక్రమాలుంటాయి. వీటితో పాటు ప్రతి రోజు రాత్రి ఆలయ ఆవరణలో భజన కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఏళ్లుగా భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న జాతరోత్సవాలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ శాశ్వత ధర్మకర్త దేవగారి రాములు, గ్రామ మాజీ సర్పంచ్‌లు కోడూరి విఠలయ్య, బిచ్చన్నగౌడ్, కృష్ణయ్యగౌడ్, గ్రామ పెద్దలు, యువకులు తెలిపారు.

ప్రత్యేకంగా డాన్స్ పోటీలు

ఉత్సవాల్లో భాగంగా 30న(సోమవారం) డాన్స్ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆలయ ఆవరణలో సాయంత్రం 3 గంటలకు ఈ పోటీలు ఉంటాయన్నారు. డాన్స్ పోటీల్లో గెలుపొందే వారికి మొదటి బహుమతిగా రూ.10వేలు, రెండవ బహుమతిగా రూ.5 వేలు, మూడవ బహుమతిగా రూ.2వేలు ఇస్తారన్నారు. పోటీల్లో పాల్గొనే వారు ఎలాంటి ప్రవేశ రుసుం లేకుండా డిసెంబరు 27వ తేదీ లోపు పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. డాన్స్ పోటీలకు 8464891319, 9010196674, 966213101 లో సంప్రదించాలని కోరారు.

అంజన్న ఉత్సవం.. పరవశించిన భక్తజనం

దుద్యాల్: అంజన్నా.. కరుణించన్నా.. అంటూ భక్తులు అడవిలో వెలిసిన ఆంజనేయస్వామిని వేడుకుంటూ మొక్కులు తీర్చుకున్నారు. మండల పరిధిలోని చిలుముల మైల్వార్ గ్రామ శివారు పెద్ద అడవిలో వెలిసిన మామిడికుంట ఆంజనేయస్వామి జాతర ఆదివారం అంగరంగ వైభవంగా సాగింది. శనివారం అర్ధరాత్రి రథోత్సవం నిర్వహించారు. తెల్లవారుజామునే హోమం చేసి, ప్రత్యేక పూజలు చేశారు. జాతరకు దుద్యాల్, బొంరాస్‌పేట్, కొడంగల్, కోస్గి, దౌల్తాబాద్ మండలాలకు చెందిన ప్రజలు హాజరయ్యారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తుల రద్దీ కొనసాగింది. ఇక్కడ ఏడాదిలో రెండుసార్లు జాతర జరగడం విశేషం.



స్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు



అలంకరణలో అంజన్నస్వామి



ప్రత్యేక పూజలో సీతారాములు

ముగిసిన ‘బ్రిగ్‌కాన్-2024’ సదస్సు

అబ్దుల్లాపూర్‌మెట్: మండల కేంద్రంలోని బ్రిలియంట్ గ్రామర్ స్కూల్ ఎడ్యుకేషనల్ సొసైటీ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూట్ ఇంటిగ్రేటెడ్ క్యాంపస్‌లో అసోసియేషన్ ఆఫ్ ఫార్మాసుటికల్ టీచర్స్ ఆఫ్ ఇండియన్(ఏపీటీఐ) ఆధ్వర్యంలో బ్రిగ్‌కాన్–2024 పేరుతో రెండు రోజుల పాటు నిర్వహించిన జాతీయ స్థాయి అవగాహన సదస్సు ఆదివారంతో ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏపీటీఐ సెంట్రల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ వీరారెడ్డి ప్రభాకర్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ.. ఫార్మారంగంలోని పరిశోధనలకు మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. విద్యార్థులు పరిశోధనలపై దృష్టి సారించాలని అకాడమిక్ డైరెక్టర్ రఘోత్తంరెడ్డి సూచించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఫార్మాసూటికల్ టీచర్స్ ఆఫ్ ఇండియా సౌత్ రీజియన్ ప్రెసిడెంట్ డాక్టర్ కృష్ణమోహన్ చిన్నాల, రఘునందన్, రమేష్, కళాశాల డైరెక్టర్స్ నరేంద్రకుమార్, పెన్లన్‌పాల్దాస్, ప్రిన్సిపాల్ డాక్టర్ కంట్లమ్, ఏఓ రవీందర్‌రెడ్డిలతో పాటు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న ఏపీటీఐ ప్రతినిధులు

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరు



ఆమనగల్లు: జెండాను ఆవిష్కరించిన సీపీఎం నాయకులు

సీపీఎం జిల్లా కార్యదర్శి భాస్కర్

ఆమనగల్లు: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి భాస్కర్ సూచించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం జమిలీ ఎన్నికల పేరుతో నియంత పాలనకు ప్రయత్నిస్తుందని ఆయన ఆరోపించారు. పట్టణంలోని మాస్టర్స్ డిగ్రీ కళాశాల ఆవరణలో ఆదివారం ఆమనగల్లు, కడ్తాల, తలకొండపల్లి ఏరియా సీపీఎం మహాసభలను నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జెండాను ఏరియా కన్వీనర్ కానుగుల వెంకటయ్య ఆవిష్కరించారు. అనంతరం జరిగిన మహాసభలో జిల్లా కార్యదర్శి భాస్కర్ మాట్లాడుతూ.. ప్రజాసమస్యలపై సీపీఎం నిరంతరం ఉద్యమిస్తుందని చెప్పారు. కార్మిక, కర్షక, విద్యార్థి, ప్రజా ఉద్యమాలలో సీపీఎం ముందుండి పోరాడుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన కార్మిక, కర్షక చట్టలకు వ్యతిరేకంగా సాగించిన ఉద్యమాల ఫలితంగా కేంద్రం వెనక్కి తగ్గిందని గుర్తుచేశారు. కేంద్ర ప్రభుత్వ విధానాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. దేశంలో ప్రజలకు విద్య, వైద్యం సరిగా అందడం లేదన్నారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలను మోసం చేసిందన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు రాజునాయక్, నాయకులు శివశంకర్, పెంటయ్య, కురుమయ్య, చెన్నయ్య, నర్సింహ, హంసమ్మ, రమేశ్, పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

రేషన్ కార్డులు మంజూరు చేయాలి

మీర్‌పేట: ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న అర్హులైన వారందరికి కొత్త రేషన్ కార్డులను ప్రభుత్వం వెంటనే మంజూరు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.సామేల్, డి.జగదీష్ డిమాండ్ చేశారు. ఆదివారం పార్టీ బాలాపూర్ మండల 2వ మహాసభను మీర్‌పేటలో నిర్వహించారు. సభకు ముఖ్య అతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ.. మండలంలోని గొలుసు కట్టు చెరువులను కబ్జా నుంచి రక్షించడంతో పాటు సుందరీకరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కార్పొరేషన్లలో రోజు విడిచి రోజు నీటిని సరఫరా చేయాలని, అదనంగా సిబ్బందిని నియమించాలని ప్రభుత్వాన్ని కోరారు. అంతకు ముందు పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో యాదగిరిచారి పాల్గొన్నారు. మండల కార్యదర్శిగా ఎం.యాదయ్య, సభ్యులుగా బి.ప్రకాశ్‌రెడ్డి, దాసరి బాబు, కె.శ్రీనివాస్, టి.ఎలీషా, శశిపాల్‌గౌడ్, శేఖర్ యాదవ్, భాగ్యలక్ష్మి ఎన్నికయ్యారు.